ఈ-పేపర్ తెలుగు డైలీ

# ఇయ్యాల్టి NEWS

Local 2 GlobaL

https://epaper.eyyaltynews.com/

## రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతంగా ముగిసిన వేసవి శిక్షణ శిబిరాలు

### క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో క్రీడాకారులకు సర్టిఫికెట్లు




**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, మే 31:** తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాలు శనివారం విజయవంతంగా ముగిసాయి. ఏప్రిల్ 15 నుండి మే 31 వరకు జంట నగరాల్లో ని ఆరు స్టేడియాలతో పాటు 32 జిల్లా కేంద్రాల్లో మే ఒకటి నుంచి మే 31వ తేదీ వరకు శిక్షణ శిబిరాలు విజయవంతంగా నిర్వహించారు.వేసవి శిక్షణ శిబిరాల ముగింపు ఉత్సవాల సందర్భంగా పాల్గొన్న ప్రతి క్రీడాకారునికి స్పోర్ట్స్ అథారిటీ సమ్మర్ కోచింగ్ క్యాంప్ సర్టిఫికెట్ల అందజేతతో పాటు ఇంటర్నల్ కాంపిటీషన్స్ లో విజేతలైన వారికి మెడల్స్ ను అందజేశారు. శనివారం ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన ముగింపు వేడుకలకు స్పోర్ట్స్ అథారిటీ ఉపసంచాలకులు శ్రీలత ముఖ్యఅతిథిగా హాజరు కాగా.. మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మనీషా, ప్రముఖ టీవీ ఆర్టిస్టులు సంజయ్, మురళి, శ్రీకాంత్ తదితరులు హాజరయ్యారు.





విద్యార్థులకు అలర్ట్.. ఇయ్యాల్టి నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభం 2లో



తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు...పరేడ్ గ్రౌండ్ ముస్తాబు 2లో



ఆదివారం సరెండర్ అవుతున్నా: కేజ్రీవాల్ 3లో



ప్రధాని పదవిపై మనసులో మాట బయటపెట్టిన కాంగ్రెస్ చీఫ్ ఖర్గే.. 3లో

# 57 సీట్లు..10 కోట్ల ఓటర్లు

### ఇయ్యాల్నే లోక్ సభ ఎన్నికల తుది దశ పోలింగ్ ● మోదీ, కంగనా సహా బరిలో కీలక నేతలు




ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, మే 31: గత 2 నెలలుగా సాగుతున్న లోక్‌సభ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఇయ్యాల శనివారం దేశవ్యాప్తంగా తుది విడత పోలింగ్ జరగనుంది. మొత్తం 7 రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతం పరిధిలో ఉన్న 57 లోక్‌సభ సీట్లకు జూన్ 1 వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు. దీని కోసం కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే ఆరు విడతల పోలింగ్ పూర్తి కాగా.. శనివారం జరగబోయే పోలింగ్‌తో దేశంలో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగియనుంది. ఇక ఫలితాలు జూన్ 4 వ తేదీన విడుదల కానున్నాయి. ఇక చివరి విడతలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసి నియోజక వర్గం కూడా ఉంది.

ఉత్తర్‌ప్రదేశ్‌లో వారణాసితో పాటు 13 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఇక బీహార్‌లో 8, పశ్చిమ బెంగాల్ 9, జార?ండ్ 3, పంజాబ్ 13, హిమాచల్ ప్రదేశ్ 4, ఒడిషా 6 లోక్‌సభ నియోజకవర్గాల్లో పోలింగ్ జరగనుంది. దీంతోపాటు కేంద్ర పాలిత ప్రాంతం అయిన చంఢీగఢ్‌కు కూడా ఈ విడతతోనే ఎన్నికల ప్రక్రియ పూర్తి కానుంది. ఇక దేశవ్యాప్తంగా 42 అసెంబ్లీ సీట్లకు కూడా ఇదే విడతలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ చివరి దశ పోలింగ్‌లో ప్రధాని నరేంద్ర మోదీ, బాలీవుడ్ క్వీన్ కంగనా రనౌత్, కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్, కాంగ్రెస్ నేత మనీష్ తివారీ, కేంద్ర మాజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్ సహా పలువురు కీలక నేతలు పోటీ పడుతున్నారు.

వీరిలో ప్రధానంగా ప్రధాని నరేంద్ర మోదీ పోటీ చేస్తున్న వారణాసి నియోజకవర్గంపైనే దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో.. వారణాసి నుంచి ఘనవిజయం సాధించిన మోదీ.. హ్యాట్రిక్ కొట్టాలని ఉవ్విళ్లూరుతున్నారు. అయితే 2014 లో కాంగ్రెస్ పార్టీ తరఫున వారణాసిలో పోటీ చేసిన అజయ్ రాయ్ మూడో స్థానంలో నిలిచారు. ఇక 2019 లో పోలైన ఓట్లలో 63 శాతానికి పైగా సాధించారు. అయితే అజయ్ రాయ్ మాత్రం 2014 లో సాధించిన ఓట్ల కంటే రెట్టింపు ఓట్లు సాధించడం గమనార్హం. ఈ నేపథ్యంలోనే మూడోసారి గెలుపు కోసం మోదీ తీవ్ర ప్రయత్నాలు చేస్తుంటే.. ఆయనను ఓడించేందుకు కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీలు ఇండియా కూటమిలో భాగంగా కలిసి పోటీ చేస్తున్నాయి. ఇక హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి నియోజకవర్గం నుంచి బాలీవుడ్ నటి కంగనా రనౌత్ బరిలో ఉన్నారు. ఎన్నికల వేళ రాజకీయాల్లోకి వచ్చిన కంగనా రనౌత్.. బీజేపీ తరఫున టికెట్ దక్కించుకున్నారు. ఇక ఇదే హిమాచల్ ప్రదేశ్‌లోని హమీర్పూర్ నుంచి కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ పోటీ చేస్తున్నారు. బీహార్‌లోని పాటలీపుత్ర నియోజకవర్గం నుంచి ఆ రాష్ట్ర మాజీ సీఎం, ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె మిసా భారతీ పోటీ చేస్తున్నారు. ఇక ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోరక్‌పూర్ స్థానం నుంచి నటుడు రవి కిషన్ తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. కేంద్ర మాజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్.. బీహార్‌లోని పాట్నా సాహిబ్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు.

ఈసారి లోక్‌సభ ఎన్నికలు మొత్తం 7 విడతల్లో జరుగుతుండగా.. ఏప్రిల్ 19 వ తేదీన మొదటి దశ పోలింగ్ జరిగింది. తొలిదశలో 102 లోక్‌సభ స్థానాలకు.. రెండో దశలో 88 స్థానాలకు.. మూడో దశలో 92 లోక్‌సభ స్థానాలకు.. నాలుగో దశలో భాగంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో 92 లోక్‌సభ స్థానాలకు.. ఐదో దశలో 49 లోక్‌సభ స్థానాలకు.. ఆరో దశలో 58 లోక్‌సభ సీట్లకు ఎన్నికలు జరిగాయి. ఏడో దశలో భాగంగా 57 లోక్‌సభ సీట్లకు జూన్ 1న ఎన్నికలు జరగనున్నాయి. జూన్ 4 వ తేదీన రిజల్ట్స్ వెలువడనున్నాయి.

## ఇయ్యాల్టి ఎగ్జిట్ పోల్స్‌పై ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు




**ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, మే 31:** ఇయ్యాల శనివారం లోక్ సభ ఎన్నికల తుది దశ పోలింగ్ జరగనుంది. ఆ తర్వాత రానున్న ఎగ్జిట్ పోల్స్‌పై కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. శనివారం సాయంత్రం నిర్ణీత సమయం కంటే ముందు ఫలితాలను ఇవ్వకూడదని ఈసీ ఆదేశాలు జారీ చేసింది. రేపు సాయంత్రం 6.30 గంటల తర్వాతే ఎగ్జిట్ పోల్స్ విడుదల చేయాలని తెలిపింది. ప్రజాప్రాతినిథ్య చట్టం సెక్షన్ 126ఏ(1) ప్రకారం నిబంధనలు పాటించాలని పేర్కొంది. లోక్ సభ ఎన్నికలతో పాటు ఒడిశా, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు, అలాగే దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాలలోని 25 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు జరిగాయి. శనివారం వరకు ఎగ్జిట్ పోల్ ఫలితాలను ఈసీ బ్యాన్ చేసింది. పూర్తిస్థాయిలో పోలింగ్ ముగిసిన తర్వాతే అంచనాలు వెల్లడించాలని పేర్కొంది.

## రూ.2.10 కోట్ల గొర్రెల స్కామ్‌లో ఏసీబీ దూకుడు

### ఇద్దరు కీలక అధికారులు అరెస్ట్




**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, మే 31:** తెలంగాణలో సంచలనం సృష్టించిన గొర్రెల పంపిణీ పథకంలో జరిగిన అవకతవకలపై దర్యాప్తు చేస్తున్న యాంటీ కరెప్షన్ బ్యూరో - ఏసీబీ.. తాజాగా మరో ఇద్దరు అధికారులను అరెస్ట్ చేసింది. ఈ గొర్రెల పంపిణీ పథకంలో ఏకంగా రూ.2.10 కోట్ల అవినీతి జరిగిందని రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు.. ఈ ఏడాది ఫిబ్రవరిలో నలుగురు ప్రభుత్వ అధికారులను అరెస్ట్ చేశారు. ఈ క్రమంలోనే వారి నుంచి సేకరించిన సమాచారంతో మరింత లోతైన దర్యాప్తు జరిపిన ఏసీబీ.. తాజాగా మరో ఇద్దరు కీలక అధికారులను పట్టుకుంది. గొర్రెల పంపిణీ పథకంలో జరిగిన స్కామ్‌లో దూకుడు పెంచిన ఏసీబీ అధికారులు.. శుక్రవారం మరో ఇద్దరిని అరెస్ట్ చేసింది. తెలంగాణ పశుసంవర్ధకశాఖ సీఈఓ సబావత్ రామ్‌చందర్‌తోపాటు ఓఎస్డీ కళ్యాణ్ కుమార్‌లను అరెస్ట్ చేశారు. రూ.2.10 కోట్ల గొర్రెల పంపిణీ పథకం కుంభకోణంలో రామ్‌చందర్, కళ్యాణ్ కుమార్ నిందితులుగా ఉన్నారని ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే రామ్‌చందర్, కళ్యాణ్ కుమార్‌లను అరెస్ట్ చేసిన ఏసీబీ అధికారులు వారిద్దరినీ కోర్టులో హాజరు పరిచారు.

## 45 గంటల ధ్యానంలో ప్రధాని మోదీ.. ఫొటోలు రిలీజ్



**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, మే 31:** ఏడు దశల పోలింగ్ ప్రచారం ముగిసిన తరువాత 45 గంటల పాటు కన్యాకుమారిలోని ప్రఖ్యాత వివేకానంద రాక్ మెమోరియల్ వద్ద ప్రస్తుతం ఆయన ధ్యానంలో ఉన్నారు. తాజాగా ధ్యాన మండపం వద్ద మోడీ కూర్చుని ఉన్న ఫోటో, వీడియోను విడుదల చేశారు. దీనికి ముందు ఆయన కన్యాకుమారిలోని భగవతి అమ్మన్ ఆలయంలో ప్రార్థనలు చేశారు. 1892లో స్వామి వివేకానంద ధ్యానం చేసిన ప్రదేశమైన మండపం వద్ద ప్రధాన మంత్రి శనివారం సాయంత్రం వరకు అక్కడే ధ్యానం చేయనున్నారు. హిందూ మహాసముద్రం, బంగాళాఖాతం, అరేబియా సముద్రం కలిసే ప్రదేశం కన్యాకుమారి.. ఇది జాతీయ ఐక్యత సందేశాన్ని ఇస్తుందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. 75 రోజుల పాటు జరిగిన ఎన్నికల ప్రక్రియలో నిరంతరాయంగా పాల్గొన్న మోడీ ప్రచారం ముగిసిన తర్వాత రెండు రోజుల పాటు ధ్యానం చేయడానికి కన్యాకుమారికి వెళ్లారు. ప్రస్తుతం అక్కడ కట్టుదిట్టమైన భద్రతను మోహరించారు.

## తెలంగాణ అవిర్భావ వేడుకలకు అధికారిక ఆహ్వానం ..

## మరి కేసీఆర్ సార్ హాజరవుతారా..?



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, మే 31:** తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు ఈ సారి కాంగ్రెస్ చేతుల మీదుగా జరుగుతున్నాయి. తొమ్మిదేళ్ల పాటు కేసీఆర్ ఆధ్వర్యంలో సాగాయి. ఎన్నికలకు ముందు ఎనిమిది తర్వాత దశాబ్ది ఉత్సవాలు చేసేశారు. కానీ అవి ప్రారంభ వేడుకలని చెప్పారు. ఇప్పుడుఅసలు దశాబ్ది ఉత్సవాలు తెలంగాణలోని కాంగ్రెస్ సర్కార్ నిర్వహిస్తోంది. తెలంగాణ ఇచ్చారన్న కారణంగా సోనియా గాంధీని ప్రత్యేకంగా ఆహ్వానించారు. అదే విధంగా తెలంగాణ రాష్ట్ర మొదటి సీఎంగా ఉన్న కేసీఆర్ ను ప్రత్యేకంగా ఆహ్వానించాలని సీఎం రేవంత్ ఆ బాధ్యతను ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్ కు అప్పజెప్పారు.

### వేదికపై సోనియాకు మాత్రమే సన్మానం

గతంలో కేసీఆర్ ను.. దశాబ్ది ఉత్సవాల్లో సన్మానిస్తారన్న ప్రచారం జరిగింది. అయితే ఆయనను సన్మానించే ఉద్దేశం లేదని సీఎంవో వర్గాలు తెలిపాయి. ఉద్యమకారులందరికీ ఆహ్వానం పంపుతున్నందున.. కేసీఆర్‌కు కూడా ఆహ్వానం పంపుతున్నారని.. ఇది ప్రభుత్వ కార్యక్రమం అయినందున ప్రోటోకాల్ ప్రకారం ఆయనకు గౌరవ మర్యాదలు లభిస్తాయని కాంగ్రెస్ పార్టీ నేతలు అంటున్నారు.

### కేసీఆరే కాదు బీఆర్ఎస్ నుంచి ఎవరూ హాజరు కాకపోవచ్చు.. !

తెలంగాణ విషయంలో తామే చాంపియన్లం అని అనుకుంటున్న బీఆర్ఎస్.. ఈ వేడుకలు హాజరయ్యే విషయంలో సందిగ్ధంలో ఉంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వహించిన వేడుకలకు కాంగ్రెస్ పార్టీ హాజరు కాలేదని గుర్తు చేస్తున్నారు. చివరికి అమరవీరుల స్తూపం ఆవిష్కరణకు కూడా రాలేదని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు కేసీఆర్ ను అవమానించడానికే ఇలా అహ్వానిస్తున్నారని ఆరోపిస్తున్నారు. అసలు సోనియాను ఏ హోదాలో ఆహ్వానించి.. సన్మానిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. ఆహ్వానం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానిది రాజకీయమేనని బీఆర్టస్ వర్గాలు ఓ క్లారిటీకి వచ్చాయి.

## రేవంత్ రెడ్డి చెప్పినట్టు వేలమంది

## తెలంగాణ బిడ్డలను చంపిన

## బలిదేవత ఎవరు..? : కేటీఆర్



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, మే 31:** కాంగ్రెస్ పార్టీపైన, గత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో తెలంగాణ సమాజానికి జరిగిన ద్రోహాలపైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఎక్స్ వేదికగా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వాలు చేసిన దారుణాలను ప్రశ్నించారు. తెలంగాణలో వేలమంది ఎవరివల్ల అ వ ం ర ం ల య్యా ర ం . . ? అమరువీరుల స్థూపం ఎవరివల్ల నిర్మించాల్సి వచ్చింది..? అంటూ ప్రశ్నల పరంపరను మొదలుపెట్టారు. హైదరాబాద్ రాష్ట్రాన్ని వేరుగానే ఉంచాలని, ఆంధ్రాతో కలుపవద్దని పోరాడిన విద్యార్థులపై సిటీ కాలేజీ దగ్గర కాల్పులు జరిపింది ఎవరు..? 1969-71 తొలిదశ ఉద్యమంలో 370 మంది తెలంగాణ బిడ్డలను కాల్చి చంపింది ఎవరు..? 1971 పార్లమెంట్ ఎన్నికల్లో మెజారిటీ సీట్లలో తెలంగాణ ప్రజాసమితి పార్టీని గెలిపిస్తే.. ఆ పార్టీని మాయం చేసింది ఎవరు..? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ విధంగా కాంగ్రెస్ ద్రోహాలను ఒక్కొక్కటిగా ప్రశ్నల రూపంలో ప్రస్తావిస్తూ.. ఆ ప్రశ్నలకు 'కాంగ్రెస్ పార్టీ' అనే సమాధానాలను ఇస్తూ పోయారు. చివరగా 'రేవంత్‌రెడ్డి చెప్పినట్టుగా వేలాది మంది తెలంగాణ బిడ్డలను చంపిన బలిదేవత ఎవరు..?' అనే ప్రశ్నను సంధించారు. ఈ ప్రశ్నకు మాత్రం 'కాంగ్రెస్ పార్టీ' అనే సమాధానం ఇవ్వకుండా ఖాళీగా వదిలేశారు. ఎవరు అనేది నెటిజన్‌లే చెప్పాలి అన్నట్టుగా డ్యాష్ పెట్టి వదిలేశారు. ఆ పోస్టుకు అమరవీరుల స్థూపం ఫొటోను జతచేశారు.

## ఎండల నుంచి బిగ్ రిలీఫ్.. రెండ్రోజుల పాటు వర్షాలు





**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, మే 31:** ఉత్తర భారతదేశంలో ఉష్ణోగ్రత 50 డిగ్రీల సెల్సియస్ దాటింది. శుక్రవారం నైరుతి రుతుపవనాలు కేరళకు చేరుకున్నాయి. ముందుగా రుతుపవనాలు మే 31న కేరళకు చేరుకుంటాయని భావించగా, ఒకరోజు ముందుగానే అంటే మే 30వ తేదీకే కేరళ తీరానికి చేరుకుంది. శుక్రవారం కేరళలోని మిగిలిన మరి కొన్ని ప్రాంతాలు, తమిళనాడు, కర్ణాటకలోని కొన్ని ప్రాంతాలకు నైరుతి రుతుపవనాలు ప్రవేశించనున్నాయి. ఈ క్రమంలోనే శుక్రవారం తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో తేలికపాటి వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది.

### ఉరుములు, మెరుపులతో వర్షం

శనివారం రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది. ఈ సమయంలో ఈదురుగాలు గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో వీచే అవకాశం ఉంది. ముఖ్యంగా హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, నల్గొండ, వరంగల్, హన్మకొండ, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ, గద్వాల, నారాయణపేట, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశారు. అలాగే వచ్చే నెల రెండో తారీఖున రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది. రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశం ఉంది.


### హైదరాబాదీలకు కూల్ న్యూస్

ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో ఎండలు భగభగ మండిపోతున్నాయి. దీంతో ఉదయం 10 తర్వాత బయటకు వచ్చే పరిస్థితి లేదు. ఎండలు దంచి కొడుతున్న వేళ వాతావరణ శాఖ రాజధాని వాసులకు శుభవార్త చెప్పింది. హైదరాబాద్ పరిసరాల్లోని అన్ని ప్రాంతాల్లో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హైదరా బాద్ పేర్కొంది. నగరంలో ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు అంచనా వేసింది. జూన్ 2న చార్మినార్, ఖైరతాబాద్, కూకట్‌పల్లి, ఎల్‌బీ నగర్, సికింద్రాబాద్, శేరిలింగంపల్లి తదితర మండలాల్లో వర్షాలు పడే అవకాశం ఉన్నందున వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. జూన్ 4వరకు ఎల్లో అలెర్ట్ ఆచరణలో ఉంటుంది.



ఫోన్ ట్యాంపింగ్ కేసు కాంగ్రెస్ ప్రభుత్వం సీబీఐ కి అప్పగించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఇందిరా పార్క్ వద్ద నిర్వహించిన బీజేపీ ధర్నాలో అంబర్ పేట డివిజన్ బీజేపీ అధ్యక్షుడు నాగభూషణం చారి ఆధ్వర్యంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, మే 31:



బీజేపీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించిన ధర్నాలో బీజేపీ నాయకులతో కలసి బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఏడెల్లి అజయ్ కుమార్

ఇయాత్యల్టి న్యూస్, అంబర్ పేట, మే 31:

ఈ-పేపర్ తెలుగు డైలీ
ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.com/
శనివారం 01, జూన్ 2024


# విద్యార్థులకు అలర్ట్.. ఇయ్యాల్టి నుంచి తరగతులు ప్రారంభం

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, మే 31:** తెలంగాణ రాష్ట్రంలో 2024-25 విద్యాసంవత్సరానికిగాను జూన్ 1 నుంచి జూనియర్ కాలేజీలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా మండలి వార్షిక అకడమిక్ క్యాలెండర్ ను విడుదల చేసింది. వేసవి సెలవుల నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీలకు మార్చి 31 నుంచి సెలవులు ప్రకటించిన సంగతి తెలిసిందే. నేటితో (మే 31)తో సెలవులు ముగియనున్నాయి. దీంతో శనివారం (జూన్ 1) నుంచి జూనియర్ కాలేజీల్లో ఇంటర్ ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ విద్యార్థులకు తరగతులు పునఃప్రారంభం కానున్నాయి.



## కౌంటింగ్ కు ముందే టీడీపీ అభ్యర్థులు తమ నియోజకవర్గాలకు చేరుకోవాలి: చంద్రబాబు




**ఇయ్యాల్టి న్యూస్, ఏపీ , మే 31:** ఏపీ టీడీపీ నేతలు ఇవాళ హైదరాబాదులో తమ పార్టీ అధినేత చంద్రబాబును కలిశారు. చినరాజప్ప, అఖిలప్రియ, ప్రభాకర్ చౌదరి, నాగుల్ మీరా, రామాంజనేయులు తదితరులు చంద్రబాబు నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా చంద్రబాబు వారితో పలు అంశాలపై చర్చించారు.
పోలింగ్ ట్రెండ్, జూన్ 4న కౌంటింగ్ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఫలితాల సందర్భంగా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకునే అవకాశం ఉందని, కౌంటింగ్ కు ముందే టీడీపీ అభ్యర్థులందరూ తమ నియోజకవర్గాలకు చేరుకోవాలని చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా సమస్యాత్మక నియోజకవర్గాల అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. అంతకుముందు, పార్టీ శ్రేణులను ఉద్దేశించి చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కూటమి విజయంలో సందేహాలు అవసరం లేదని, అలాగని శ్రేణులు ఉదాసీనంగా ఉండరాదని అన్నారు. కౌంటింగ్ సమయంలో టెన్షన్ పడొద్దని, ఎవరూ తొందరపాటు చర్యలకు దిగొద్దని చంద్రబాబు స్పష్టం చేశారు.

## పదవీ విరమణ చేసిన ఏబీవీ, బాధ్యతలు చేపట్టిన రోజే రిటైర్మెంట్



**ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, మే 31:** సుదీర్ఘ న్యాయపోరాటం చేసి ఎట్టకేలకు పోస్టింగ్ అందుకున్న ఏపీ సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు ఈ సాయంత్రం ఉద్యోగ విరమణ చేశారు. క్యాట్ ఉత్తర్వులను సమర్థిస్తూ, ఏపీ హైకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో... ఏపీ ప్రభుత్వం ఏబీ వెంకటేశ్వరరావుకు పోస్టింగ్ ఇస్తుందా, లేదా? అనే ఉత్కంఠ ఈ ఉదయం వరకు కొనసాగింది. ఎందుకంటే, ఏబీ వెంకటేశ్వరావు శుక్రవారం (మే 31) పదవీ విరమణ చేయాల్సి ఉంది. అయితే, ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రింటింగ్ అండ్ స్టేషనరీ కమిషనర్ గా పోస్టింగ్ ఇవ్వడంతో ఉత్కంఠకు తెరపడింది. శుక్రవారం విజయవాడలోని ముత్యాలంపాడు గవర్నమెంట్ ప్రెస్ లో ఏబీ వెంకటేశ్వరరావు కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించారు. సాయంత్రానికి అదే హోదాలో గౌరవప్రదంగా ఉద్యోగ విరమణ చేశారు. పదవీ విరమణ చేసిన ఏబీ వెంకటేశ్వరరావుకు ఏపీఎస్ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, టీడీపీ నేత పట్టాభి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. కాగా, ఐపీఎస్ అధికారి అయిన ఏబీ వెంకటేశ్వరరావు సీనియారిటీ పరంగా ప్రస్తుతం పోలీస్ శాఖలో డీజీ ర్యాంకులో ఉన్నారు. గతంలో ఇంటెలిజన్స్ చీఫ్ గా ఉన్న ఆయన పరికరాల కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు వచ్చాయి. దాంతో వైసీపీ సర్కారు ఆయనపై రెండు పర్యాయాలు సస్పెన్షన్ విధించింది. ఈ క్రమంలో ఏబీ పట్టువిడవకుండా న్యాయపోరాటం సాగించారు. ఆయన న్యాయపోరాటం ఫలించి.. క్యాట్ ఉత్తర్వులపై తాము జోక్యం చేసుకోబోమని ఏపీ హైకోర్టు స్పష్టం చేయడంతో... ప్రభుత్వం ఆయనకు పోస్టింగ్ ఇవ్వక తప్పలేదు.

## కవితను తప్పించేందుకే బీఎల్ సంతోష్‌పై కేసీఆర్ ప్రభుత్వం కేసులు పెట్టింది: బీజేపీ ఎంపీ లక్ష్మణ్



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, మే 31:** గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు తమ పార్టీ నేత బీఎల్ సంతోష్‌పై కేసీఆర్ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టిందని... కవితను మద్యం కేసు నుంచి తప్పించేందుకే ఆయనపై కేసులు పెట్టారని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కే లక్ష్మణ్ ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌పై రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆ పార్టీ నేతలు ధర్నా చౌక్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ... తాను కూడా ఫోన్ ట్యాపింగ్ బాధితుడినే అని ఎన్నికల సమయంలో చెప్పిన రేవంత్ రెడ్డి ఇప్పుడు దర్యాప్తునకు మీనమేషాలు లెక్కిస్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు కేసీఆర్ అవినీతిపై కూడా రేవంత్ రెడ్డి మాట్లాడారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు మాత్రం ఫోన్ ట్యాపింగ్ సహా ఏ కేసుల్లోనూ చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీతో కేసీఆర్ లోపాయికారి ఒప్పందం చేసుకున్నారా? అని ప్రశ్నించారు. ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ తన హయాంలో నిఘా వ్యవస్థను దుర్వినియోగం చేశారని విమర్శించారు. ఉపఎన్నికల్లో ఓటర్లను కొనుగోలు చేసేందుకు, ప్రత్యర్థులను దెబ్బకొట్టేందుకు ఫోన్ ట్యాపింగ్‌ను ఉపయోగించుకున్నారని ధ్వజమెత్తారు. టెలికం రెగ్యులేటరీ చట్టానికి భిన్నంగా, కేంద్రం అనుమతి లేకుండా గత ప్రభుత్వం కుట్ర చేసిందన్నారు. ఫోన్ ట్యాపింగ్ సహా వివిధ అక్రమ కేసుల్లో దోషులకు శిక్ష పడేవరకు బీజేపీ రాజకీయ, న్యాయ పోరాటం చేస్తుందన్నారు. తెలంగాణ చరిత్రలో రేవంత్ రెడ్డి చరిత్రహీనుడిగా మిగిలిపోకుండా ఉండాలంటే ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం, ధరణి అవినీతిపై కూడా కాంగ్రెస్ ఇప్పుడు మాట్లాడటం లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా రూ.500 బోనస్, రుణమాఫీ అమలు చేయడం లేదన్నారు. తెలంగాణలో మెజార్టీ లోక్ సభ స్థానాలు బీజేపీయే గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## ఆసుపత్రుల్లోని క్యాంటీన్లకు బిల్లులు చెల్లించలేదంటూ హరీశ్ రావు ఆగ్రహం



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, మే 31:** తెలంగాణ ఆసుపత్రుల్లోని క్యాంటీన్లకు రూ.20 కోట్ల బిల్లులను ప్రభుత్వం చెల్లించలేదని దీంతో రోగులు ఇబ్బంది పడుతున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. రోగులతో పాటు డాక్టర్లు, ఆసుపత్రి సిబ్బంది కూడా అవస్థలు పడుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రోగులకు, డాక్టర్లకు ఆహారం అందటం లేదని వాపోయారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారుఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్యాంటీన్లకు బకాయిలు చెల్లించకపోవడంతో పేషెంట్లు ఇబ్బందులు పడుతున్నారని ఓ పత్రికా కథనాన్ని ఆయన తన ట్వీట్‌లో అటాచ్ చేశారు.

## తెలంగాణ తేజం పాటను ఆవిష్కరించిన కేసీఆర్

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, మే 31:** జబర్దస్త్ ఫేమ్, నటుడు రాకింగ్ రాకేశ్ హీరోగా తెరకెక్కిన కేసీఆర్ ( కేశవ చంద్ర రమావత్ ) సినిమాలోని తెలంగాణ తేజం పాటను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆవిష్కరించారు. హైదరాబాద్ నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి సినిమా హీరో, నిర్మాత రాకింగ్ రాకేశ్ శుక్రవారం వెళ్లి ఆయన్ను కలుసుకున్నారు. రాకింగ్ రాకేశ్‌తోపాటు, మ్యూజిక్ డైరెక్టర్ చరణ్ అర్జున్, జోర్దార్ సుజాత, సింగర్లు విహా, గీత, రచయిత సంజయ్ మహేశ్‌లు కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా తెలుగు తేజం పాటను కేసీఆర్ ఆవిష్కరించారు.




# తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు...




**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, మే 31:** తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలకు పరేడ్ గ్రౌండ్ ముస్తాబు అవుతుంది. అవతరణ ఏర్పాట్లను సీఎస్, డిజిపి, ఉన్నతాధికారులు పరిశీలించారు. జూన్ 2 ప్రభుత్వ కార్యక్రమానికి విశిష్ట అతిధి సోనియాగాంధీ రానున్నారు. సుమారు 20 నుంచి 25 వేల మంది కోసం పరేడ్ గ్రౌండ్లో ఏర్పాట్లు చేస్తున్నారు. 1860 మంది వీవీఐపీలు, 11 వేల మంది సామాన్య ప్రజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. జూన్ 2న ఉదయం 9.30 గంటలకు గన్‌పార్క్‌లోని అమర వీరుల స్థూపం వద్ద తెలంగాణ రాష్ట్ర సాధనలో మరణించిన వారికి ముఖ్యమంత్రి నివాళు లర్పిస్తారు. అనంతరం ఉదయం 10 గంటలకు పరేడ్ గ్రౌండ్‌లో ముఖ్యమంత్రి జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. పోలీసు బలగాల కవాతు, మార్చ్ ఫాస్ట్, గౌరవ వందనం ఉంటుంది. తెలంగాణ రాష్ట్ర అధికారిక గీతాన్ని ఆవిష్కరిస్తారు. ఆ తర్వాత సోనియా గాంధీ ప్రసంగం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగం ఉంటుంది. పోలీసు సిబ్బందికి, ఉత్తమ సిబ్బందికి అవార్డులు అందజేస్తారు. అవార్డు గ్రహీతలతో ఫోటో సెషన్ తర్వాత కార్యక్రమం ముగుస్తుంది. జూన్ 2వ తేదీ సాయంత్రం ట్యాంక్ బండ్ పై తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ప్రారంభం కానున్నాయి. ట్యాంక్ బండ్ పై తెలంగాణకు సంబంధించిన హస్తకళలు, ప్రత్యేక ఉత్పత్తులు, వివిధ రకాల ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. సాయంత్రం 6.30 గంటలకు ముఖ్యమంత్రి ట్యాంక్‌బండ్‌కు చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సందర్శిస్తారు. తెలంగాణ కళారూపాల అద్భుత ప్రదర్శనకు అద్దం పట్టేలా కార్నివాల్ నిర్వహిస్తారు. దాదాపు 700 మంది కళాకారులు ఇందులో పాల్గొంటారు. అనంతరం ట్యాంక్ బండ్ ఏర్పాటు చేసిన వేదికపై 70 నిమిషాల పాటు వివిధ సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఉంటాయి. స్టేజ్ షో అనంతరం ట్యాంక్ బండ్ పై చివరి నుంచి చివరి వారం వరకు జాతీయ జెండాలతో భారీ ఫ్లాగ్ వాక్ నిర్వహించనున్నారు. ఇందులో దాదాపు 5 వేల మంది పాల్గొంటారు. ఈ సందర్భంగా ఫ్లాగ్ వాక్ జయ జయహే తెలంగాణ పూర్తి వెర్షన్ (13.30 నిమిషాలు) పాటను విడుదల చేయనున్నారు. తెలంగాణ కవి అందెశ్రీ, సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణిని సన్మానిస్తారు. రాత్రి 8.50 గంటలకు హుస్సేన్ సముద్రంపై ఆకాశాన్ని పది నిమిషాల పాటు పేల్చే బాణసంచా కార్యక్రమంతో వేడుకలు ముగుస్తాయి.

## హైదరాబాద్‌లో ప్రపంచ వరి సదస్సు.. సన్నాహాలు ముమ్మరం



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, మే 31:** దేశంలోనే తొలిసారిగా హైదరాబాద్ కేంద్రంగా ప్రపంచ వరి సదస్సును జూన్ 7, 8వ తేదీల్లో తాజ్ కృష్ణా హోటల్‌లో నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ (ఫిలిఫైన్స్) సహకారంతో నిర్వహిస్తున్న ఈ సదస్సులో 28 దేశాల నుంచి దాదాపు 500 మంది వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యాపారులు, అనుబంధ రంగాల ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. వివిధ దేశాల నుంచి వరి శాస్త్రవేత్తలు ఈ వరి సదస్సులో పాల్గొనే అవకాశం ఉందని ఆయన వెల్లడించారు. ప్రపంచ వరి సదస్సుకు సన్నాహాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయన్నారు. ఈ సదస్సులో వరి రకాల ప్రదర్శనతో పాటు రాష్ట్రానికి సంబంధించి వివిధ ఉత్పత్తుల లభ్యతపై వ్యవసాయశాఖ ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందిస్తున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడించారు. భారతదేశంలోనే తొలిసారిగా ప్రపంచ వరి సదస్సు-2024కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ సదస్సు బియ్యం ఎగుమతులను ప్రోత్సహించడం, భారతదేశం, తెలంగాణ నుంచి బియ్యం రకాలను ప్రదర్శించడం, విజ్ఞాన వేదికను అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది ఇంటర్నేషనల్ కమోడిటీ ఇన్స్టిట్యూట్ భాగస్వామ్యంతో జరుగుతుంది.


## గ్రూప్-1 పరీక్షను వాయిదా వేయండి: బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, మే 31:** 8 ఏళ్లుగా గ్రూప్-1 కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు న్యాయం జరిగేలా చూడాలని అభ్యర్థనటీఎస్‌పీఎస్‌సీ నిర్వహించే గ్రూప్-1 పరీక్ష వాయిదా వేయాలని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. జూన్ 9వ తారీఖున జరగబోయే గ్రూప్-1 ఎగ్జామ్‌ను కనీసం ఒక నెల అయినా వాయిదా వేస్తే బాగుంటుందని తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా టీఎస్‌పీఎస్‌సీకి విజ్ఞప్తి చేశారు. ఎందుకంటే అదే రోజు కేంద్ర ప్రభుత్వ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) ఇన్‌స్పెక్టర్ ఎగ్జామ్ కూడా ఉంది. దానికి చాలా మంది తెలంగాణ నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. అలాగే చాలా మంది ప్రభుత్వ ఉద్యోగులు (రెవెన్యూ, పోలీసు) గత నాలుగు నెలల నుండి ఎన్నికల నిర్వహణలో తలమునకలైనందు వల్ల వాళ్లకు బాగా ప్రిపేర్ అయ్యే అవకాశం దొరకలేదు. కాబట్టి వాళ్లకు ఒక నెలైనా సమయం ఇస్తే.. కనీసం లాస్ ఆఫ్ పే సెలవు మీద చదువుకుని పరీక్షకు హాజరవుతారని తెలిపారు. ఈ విషయంలో సాధ్యాసాధ్యాలు పరిశీలించి గత ఎనిమిదేళ్లుగా గ్రూప్-1 కోసం ఎదురుచూస్తున్న అందరు నిరుద్యోగ అభ్యర్థులకు న్యాయం జరిగేలా నిర్ణయం తీసుకోవాలని బోర్డును కోరారు. అలాగే అన్ని జాగ్రత్తలు తీసుకొని పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ తరుపున ఆయన అభ్యర్థించారు. అదే విధంగా ఏఈఈ పరీక్ష రాసిన అభ్యర్థులు ఎంతో కాలంగా నియామక పత్రాల కోసం ఎదురుచూస్తున్నారని, వారికి వెంటనే న్యాయం చేయాలని ప్రవీణ్ కుమార్ కోరారు.

## ప్రైవేటు స్కూళ్లలో యూనిఫామ్స్, బుక్స్, షూస్, బెల్టులు అమ్మవద్దు హైదరాబాద్ డీఈవో కీలక ఆదేశాలు

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, మే 31:** ప్రైవేటు పాఠశాలల నిరంతర పర్యవేక్షణకు మండలస్థాయి కమిటీ ఏర్పాటుకు ఆదేశం
కోర్టు ఆదేశాల మేరకు పాఠశాల కౌంటర్‌లో విక్రయాలు ఉంటే లాభాపేక్ష లేకుండా ఉండాలన్న డీఈవోనిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక హైదరాబాద్ డీఈవో నగరంలోని ప్రైవేటు స్కూళ్లకు కీలక ఆదేశాలు జారీ చేశారు. యూనిఫామ్‌లు, షూస్, బెల్టుల అమ్మకాలపై నిషేధం విధించినట్లు పేర్కొన్నారు. స్కూల్ ప్రాంగణంలో బుక్స్, స్టేషనరీ కూడా అమ్మకూడదని ఆదేశించారు. హైదరాబాద్ జిల్లాలో నడుస్తున్న ప్రైవేటు, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ స్కూళ్ళకు ఆదేశాలు వర్తిస్తాయని ఆదేశాల్లో పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలల నిరంతర పర్యవేక్షణకు మండలస్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు అధికారులను ఆదేశించారు. కోర్టు ఆదేశాల మేరకు పాఠశాల కౌంటర్‌లో విక్రయాలు ఉంటే లాభాపేక్ష లేకుండా ఉండాలని పేర్కొన్నారు. అందుకే స్కూళ్లలో ఎలాంటి విక్రయాలు ఉండరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉల్లంఘనలు జరిపితే తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు.




## ఐదు రోజుల నష్టాలకు బ్రేక్... స్వల్ప లాభాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ఇయ్యాల్టి న్యూస్, బిజినెస్, మే 31:** స్టాక్ మార్కెట్లు సెన్సెక్స్, నిఫ్టీ స్వల్ప లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ 75.71 పాయింట్ల లాభంతో 73,961.31 వద్ద ముగియగా... నిఫ్టీ 42.00 పాయింట్ల వృద్ధితో 22,530.70 వద్ద ముగిసింది. వరుసగా గత ఐదు రోజులుగా కొనసాగుతున్న నష్టాల పరంపరకు శుక్రవారం తెరపడింది.నేడు ఎగ్జిట్ పోల్స్ రిజల్ట్స్ రానుండగా, జూన్ 4న ఫలితాలు వెలువడనున్నాయి. ఈ నేపథ్యంలో, స్టాక్ మార్కెట్ లావాదేవీలు ఆచితూచి నిర్వహిస్తున్న ట్రెండ్ కనిపిస్తోంది. అదానీ ఎంటర్ ప్రైజెస్, అదానీ పోర్ట్స్, శ్రీరామ్ ఫైనాన్స్ షేర్లు లాభపడగా... దివీస్ ల్యాబ్స్, నెస్లే, ఎల్టీఐ మైండ్ ట్రీ షేర్లు నష్టాలు చవిచూశాయి.



## ఓ తండ్రి అంతిమ తీర్పు.. సొంత కొడుక్కి జైలు శిక్ష విధించాలని పదేళ్లు పోరాటం!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, మే 31:** మాతృత్వం ఏ తల్లికైనా అద్భుతమే. పురిటి బిడ్డ నుంచి రెక్కలొచ్చేంత వరకూ దాసిలా ఆ బిడ్డకు సేవలు చేస్తుంది. మలమూత్రాలను ఛీదరించుకోకుండా శుభ్రం చేస్తుండి. కడుపు నిండా భోజనం పెట్టి బిడ్డ ఆకలిని తీరుస్తుంది. బిడ్డ ప్రతి అవసరాన్ని నోరువిప్పి చెప్పక ముందే గ్రహించి అన్నీతానై చేసి మురిసిపోతుంది. అంతటి త్యాగమూర్తి అనారోగ్యంతో పదేపదే బాత్రూంకి వెళ్తే ఆ కొడుకుకు అసహ్యం కలిగింది. అంతే తల్లి తల నరికి బావిలో పడేశాడు. తండ్రికి ఇంటికొచ్చే సరికి ఆ కొడుకు ఇంతటి దారుణానికి ఒడిగట్టాడు. కడుపు రగిలిపోయిన తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయడమేకాదు.. పదేళ్లపాటు పోరాడి ఆ కసాయి కొడుకుకి శిక్ష పడేంత వరకూ శాంతించలేదు. తీరా కోర్టు కొడుకుకి శిక్ష విధించిన తర్వాత గుండెలవిసేలా రోధించాడు. ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్‌లో ఈ దారుణ ఘటన చోటు చేసుకుంది.2014 నాటి కేసు ఇది. జైసింగ్‌పూర్ కొత్వాలిలో నివాసం ఉంటున్న సుకై విష్ణకర్మ అనే వ్యక్తి తన భార్య రాంలాలీకి కడుపునొప్పి రావడంతో.. ఆమెకు మందులు తీసుకురావడానికి బయటకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేసరికి



ఇంట్లోని దృశ్యం చూసి షాక్‌కు గురయ్యాడు. ఇంట్లోకి ప్రవేశించిన విష్ణకర్మ తన కొడుకు మహేంద్ర రక్తంతో తడిసి ఉండటాన్ని చూసి హడలెత్తిపోయాడు. ఏం జరిగిందని ప్రశ్నించగా.. తల్లి తల నరికి బావిలో పడేసినట్లు కొడుకు చెప్పాడు. కడుపు నొప్పి కారణంగా తల్లి పదే పదే మల విసర్జన చేయడం కొడుకు మహేంద్రకు అసహ్యం కలిగించింది. దీంతో ఆ కొడుకు తల్లి గొంతు కోసి హత్య చేశాడు. ఇది విన్న ఆ తండ్రికి కోపం కట్టలు తెంచుకుని వచ్చింది. ఇలాంటి కసాయి కొడుక్కి కఠిన శిక్ష విధించాలని అనుకున్నాడు. అంతే కోపానికి తమాయించుకుని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి కొడుకు మీద ఫిర్యాదు చేశాడు. వెంటనే పోలీసు బృందం సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు.నాటి నుంచి దాదాపు పదేళ్ల పాటు ఈ కేసు కోర్టులో నడుస్తూనే ఉంది. తమ కడుపున పుట్టిన కసాయి కొడుక్కి శిక్ష పడేంత వరకు ఆ తండ్రి పోరాడాడు. చివరకు ఈ కేసును గురువారం విచారించిన కోర్టు మొత్తం ఏడుగురు సాక్షుల వాంగ్మూలాలను పరిగణనలోకి తీసుకుని అంతిమ తీర్పును వెలువరించింది. విచారణ సమయంలో నిందితుడి తండ్రి విష్ణకర్మ భార్యను కోల్పోయిన బాధను వ్యక్తం చేశాడు. అలాగే తన కొడుకును పిచ్చివాడిగా అభివర్ణించాడు. లేదంటే ఏ కొడుకూ తన చేతులతో ఈ పని చేయడని ఆవేదన వ్యక్తం చేశాడు. విచారణ తర్వాత కోర్టు మహేంద్రను దోషిగా నిర్ధారించి జీవిత ఖైదు విధించింది. కోర్టు తీర్పు విన్న తండ్రి కళ్లలో నీళు సుడులు తిరిగాయి. ఇలాంటి పరిస్థితి ఏ భర్తకు, ఏ తండ్రికి రాకూడదంటూ గుండెలవిసేలా రోధించాడు.

## ప్రధానిగా పదవిపై మనసులో మాట బయటపెట్టిన కాంగ్రెస్ చీఫ్ ఖర్గే..

**ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ మే 31:** నేటితో సార్వత్రిక ఎన్నికల సంగ్రామం ముగుస్తోంది. జూన్ 4న ఫలితాలు వెలువడనున్నాయి. మోడీ నేతృత్వంలో ఎన్డీయే కూటమి మరోసారి అధికారంలోకి వస్తుందని బీజేపీ పార్టీ భావిస్తుంటే, ఈ సారి బీజేపీని గద్దె దించుతామని ఇండియా కూటమి ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని పదవిపై తన మనసులోని మాట బయటపెట్టాడు. ఇండియా కూటమి, బీజేపీని ఓడించిన తర్వాత, నరేంద్రమోడీ స్థానంలో రాహుల్ గాంధీ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించాలని ఖర్గే అన్నారు. ప్రియాంకాగాంధీ కూడా ఎన్నికల్లో పోటీ చేసేందుకు తాను ఒత్తిడి తెచ్చానని చెప్పారు. ఓ ప్రైవేటు ఛానల్ తో మాట్లాడిన ఖర్గే, భారత్ జోడో యాత్రతో రాహుల్ గాంధీ విస్తృతంగా ప్రచారం చేశారని, ప్రధాని మోడీ



టార్గెట్‌గా విమర్శలు గుప్పించారని అన్నారు. రాహుల్ గాంధీనే ప్రధాని పదవికి పాపులర్ ఛాయిస్‌గా చెప్పారు. రాహుల్ యువత, దేశానికి ప్రాతినిధ్యం వహిస్తాడని, ఇండియా కూటమి ప్రధాని అభ్యర్థిత్వంపై ప్రశ్నించగా చెప్పారు. ఇదే విధంగా ప్రధాన మంత్రి అభ్యర్థి ఎవరనేదానిపై కూటమి నిర్ణయిస్తుందని చెప్పారు.

ఇదిలా ఉంటే ఇండియా కూటమిలోని ప్రధాన పార్టీలు ఢిల్లీ వేదికగా జూన్ 1న సమావేశం కానున్నాయి. భవిష్యత్ కార్యాచరణ, జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపుపై చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోవడం ఖామని ఖర్గే ధీమా వ్యక్తం చేశారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కి 44 సీట్లు రాగా, 2019లో 52 సీట్లను సాధించింది. ఈ సారి కాంగ్రెస్ మంచి పనితీరు కనబరుస్తుందని ఆ పార్టీ ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

## భోజనం పెట్టలేదని భార్య తల నరికిన భర్త..ఆపై చర్మం కోసి ముక్కలు ముక్కలుగా ..

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, మే 31:** ఒక వ్యక్తి కిరాతకంగా ప్రవర్తించాడు. భోజనం పెట్టేందుకు నిరాకరించిన భార్య తల నరికి చంపాడు. ఆపై చర్మం కోసి మృతదేహాన్ని ముక్కలుగా నరికాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు షాక్ అయ్యారు. కర్ణాటకలోని తుమకూరు జిల్లాలో ఈ దారుణం జరిగింది. హులియూరుదుర్గ గ్రామంలోని అద్దె ఇంట్లో నివసిస్తున్న శివరామ్‌కు పదేళ్ల కిందట పుష్పతో పెళ్లైంది. అతడు రంపం మిల్లులో పని చేయడంపై భార్యాభర్తల మధ్య తరుచుగా గొడవలు జరుగుతున్నాయి.కాగా, సోమవారం రాత్రి శివరామ్ మిల్లు నుంచి ఇంటికి తిరిగి వచ్చాడు. అయితే అతడి ఉద్యోగం విషయంపై భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఇది తీవ్రం కావడంతో భర్తకు



భోజనం పెట్టేందుకు భార్య పుష్ప నిరాకరించింది. ఆగ్రహించిన శివరామ్ కత్తితో పొడిచి 35 ఏళ్ల భార్యను హత్య చేశాడు. ఆ తర్వాత ఆమె తల నరికాడు. రాత్రంతా చర్మాన్ని తొలగించి మృతదేహాన్ని ముక్కలుగా నరికాడు.మరోవైపు శివరామ్ మంగళవారం ఉదయం తన భార్యను చంపిన విషయాన్ని ఇంటి యజమానికి చెప్పాడు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. వంట గదిలో బీభత్సంగా ఉన్న పుష్ప మృతదేహాన్ని గుర్తించారు. పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శివరామ్‌ను అరెస్ట్ చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆ దంపతుల ఎనిమిదేళ్ల కుమారుడు ఇంట్లో నిద్రపోతుండటాన్ని పోలీసులు గమనించారు..

## ఫోన్ తీసుకున్నాడనే కోపంతో భర్తకు కరెంట్ షాక్ ఇచ్చిన భార్య..?
## కుర్చీకి కట్టేసి మరీ చిత్రహింసలు..చివరకు..



**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, మే 31:** ఉత్తరప్రదేశ్‌లోని మెయిన్‌పురిలో ఓ షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. భార్య మొబైల్ వాడకాన్ని తగ్గించాలని ప్రయత్నిస్తున్న ఓ భర్తకు ఆ ఇల్లాలు ఊహించని ట్విస్ట్ ఇచ్చింది. భర్త ఫోన్ తీసుకున్నాడనే కోపంతో రగిలిపోయిన ఆమె భర్తపై దాడికి దిగింది. కరెంట్ షాక్ పెట్టి చిత్ర హింసలకు గురిచేసింది. భార్య బ్యాడ్ హ్యాబిట్ తగ్గించాలనుకున్న ఆ భర్త భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. ప్రస్తుతం ఈ ఘటనకు సంబంధించిన వార్త సోషల్ మీడియా వేదికగా వైరల్‌గా మారింది. పూర్తి వివరాల్లోకి వెళితే..ఉత్తరప్రదేశ్‌లోని మెయిన్‌పురికి చెందిన బేబీ యాదవ్, ప్రదీప్ సింగ్ భార్యా భర్తలు. వారికి 14ఏళ్ల కుమారుడు కూడా ఉన్నాడు. కాగా, బేబీ యాదవ్ గత కొంత కాలంగా మొబైల్ ఫోన్‌కు బాగా అలవాటుపడిపోయింది. గంటల తరబడి ఫోన్‌లోనే కాలం గడుపుతోందనే ఆరోపణతో ఆమె భర్త తనను పలుమార్లు మందలించాడు. అలవాటు మానుకోవాలని ఆమెను అతడు హెచ్చరించాడు. అయినా వినకపోవడంతో ఆమె తల్లిదండ్రులకు విషయం చెప్పాడు. దానికి వారు ఆమె నుంచి ఫోన్ తీసుకోవాలని సలహా ఇచ్చారట. దాంతో అతడు ఆమె ఫోన్‌ను తీసుకున్నాడు. అంతే.. ప్రదీప్ సింగ్‌పై ఆగ్రహంతో ఆమె.. అదను చూసి అతనికి మత్తుమందు ఇచ్చింది. అనంతరం కుర్చీకి కట్టేసి విచక్షణా రహితంగా కొట్టింది. అంతటితో ఆగకుండా పలుమార్లు కరెంట్ షాక్ పెట్టింది. అడ్డుకోబోయిన తన కుమారుడిపై కూడా దాడి చేసింది.అయితే ఎలాగోలా అమె నుంచి తప్పించుకున్న ప్రదీప్.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఆమెపై హత్యాయత్నం సహ వివిధ సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు. భార్య దాడిలో తీవ్రంగా గాయపడిన భర్త ప్రదీప్ సింగ్ ప్రస్తుతం సైఫాయి మెడికల్ కాలేజీలో చికిత్స పొందుతున్నాడు. కాగా, బేబీ యాదవ్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ప్రస్తుతం బేబీ యాదవ్ పరారీలో ఉండడంతో ఆమె కోసం గాలిస్తున్నారు.

## దోషిగా తేలిన డొనాల్డ్ ట్రంప్.. కూతురు ఇవాంక ఎమోషనల్ పోస్ట్!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, మే 31:** పోర్న్ స్టార్ స్టార్మీ డేనియల్స్‌తో అక్రమ సంబంధం ఉదంతంలో హష్ మనీ కేసులో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దోషిగా తేలిన విషయం తెలిసిందే. స్టార్మీ డేనియల్‌కు డబ్బులు ఇచ్చిన కేసులో మన్‌హట్టన్ కోర్టు జ్యూరీ ఆయనను దోషిగా తేల్చింది. 34 అంశాల్లో ఆయనను దోషిగా నిర్ధారించింది. మాజీ అటార్నీ మైఖేల్ కోహెన్ ద్వారా ట్రంప్ పోర్న్ స్టార్ స్టార్మీ డేనియల్స్‌కు డబ్బులు చెల్లించారు. అయితే, ఈ విషయాన్ని కప్పిపుచ్చేందుకు ట్రంప్ తన వ్యాపార ఖాతాలను తారుమారు చేశారు. ఈ కేసులో కొన్ని రోజుల నుంచి కోర్టులో విచారణ జరిగింది. చివరికి న్యాయస్థానం మాజీ అధ్యక్షుడిని దోషిగా తేల్చింది. దోషిగా తేలిన ట్రంప్‌కు జులై 11వ తేదీన మన్‌హట్టన్ కోర్టు శిక్షను ఖరారు చేయనుంది. ఇక తన తండ్రి దోషిగా తేలడంతో కుమార్తె ఇవాంక ట్రంప్ ఎమోషనల్ పోస్ట్ చేశారు. ఈ మేరకు తన తండ్రితో ఉన్న చిన్ననాటి ఫొటోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ఆ ఫొటోకు 'లవ్




యూ డాడ్' అంటూ హార్ట్ ఎమోజీతో కూడిన క్యాప్షన్ ఇచ్చారు. ప్రస్తుతం ఈ ఫొటో నెట్టింట వైరల్ అవుతోంది. ఇక ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఇవాంక వైట్‌హౌస్‌లో ఆయనకు అడ్వైజర్‌గా సేవలు అందించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత గత ఎన్నికల్లో ట్రంప్ ఓడిపోవడంతో ఆమె తన తండ్రి వ్యవహారాలపై ఎక్కడా మాట్లాడలేదు. సోషల్ మీడియా వేదికల్లో కూడా గత కొంతకాలంగా ఆమె చేస్తున్న పోస్టుల్లో ఎక్కువగా ఫ్యామిలీ హాలీడే వెకేషన్స్ ఫొటోలు, సెల్ఫీలు, హాలీడే సందేశాలు మాత్రమే కనిపించాయి.

## ఆదివారం సరెండర్ అవుతున్నా: కేజ్రీవాల్

**ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ మే 31:** ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ శుక్రవారం ఓ వీడియో రిలీజ్‌చేశారు. ఢిల్లీ లిక్కర్ కేసులో బెయిల్ మీద బయటకు వచ్చిన ఆయన.. జూన్ రెండో తేదీన ఆదివారం సరెండర్ కానున్నట్లు చెప్పారు. మళ్లీ తీహార్ జైలుకు వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. లిక్కర్ స్కామ్‌తో లింకున్న మనీ ల్యాండరింగ్ కేసులో కేజ్రీని ఈడీ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అయితే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తమ పార్టీ తరఫున ప్రచారం నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సుప్రీంలో పిటీషన్ పెట్టుకున్నారు. ఆయనకు 21 రోజుల తాత్కాలిక బెయిల్‌ను సుప్రీం జారీ చేసింది. ఆ బెయిల్ గడువు జూన్ ఒకటో తేదీతో ముగియనున్నది.బెయిల్‌ను పొడిగించాలని కేజ్రీ పెట్టుకున్న అభ్యర్థనను సుప్రీంకోర్టు రిజిస్ట్రీ స్వీకరించలేదు. దీంతో కేజ్రీ దారులు మూసుకుపోయాయి. దేశాన్ని నియంతృత్వం నుంచి రక్షించేందుకు మళ్లీ జైలుకు వెళ్లనున్నట్లు కేజ్రీ వెల్లడించారు. మళ్లీ జైలుకు వెళ్తే తనను



ఎన్ని రోజులు బంధిస్తారో తెలియదన్నారు. జైలులో ఉన్నప్పుడు తనను ఎన్నో విధాలుగా వేధించినట్లు ఆరోపించారు. తనకు మెడిసిన్ ఇవ్వడం ఆపేశారన్నారు. జైలుకు వెళ్లేముందు తన బరువు 70 కేజీలు అని, ఇప్పుడు 64 కేజీలకు చేరుకున్నట్లు వెల్లడించాడు.జైలు నుంచి రిలీజైన తర్వాత కూడా ఇంకా బరువు పెరగలేదన్నాడు. తమ సర్కారు అమలు చేస్తున్న అన్ని స్కీమ్‌లు యధాతథంగా ఉంటాయని, మళ్లీ వచ్చిన తర్వాత ప్రతి మహిళకు వెయ్యి ఇస్తానన్నారు.


## ప్రైవేటు పార్టులో దాచి బంగారం స్మగ్లింగ్.. ఎయిర్‌హోస్టెస్ అరెస్ట్

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, మే 31:** బంగారం స్మగ్లింగ్ చేస్తూ ఓ ఎయిర్‌హోస్టెస్ అధికారుల ముందు అడ్డంగా దొరికిపోయింది. సుమారు కేజీ బంగారాన్ని రహస్య భాగాల్లో దాచుకుని తరలిస్తుండగా డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు గుర్తించి అరెస్ట్ చేశారు.డీఆర్ఐ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. నిందితురాలు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌కు చెందని ఎయిర్‌హోస్టెస్ సురభి ఖాతున్ గా గుర్తించారు. ఈ నెల 28న మస్కట్ నుంచి కేరళ కన్నూర్‌కు వచ్చిన విమానంలో ఆమె క్రూ సిబ్బందిగా ఉన్నారు. విమానం కన్నూర్ చేరుకోగానే.. అధికారుల తనిఖీల్లో ఎయిర్‌హోస్టెస్ బండారం బయటపడింది. ఆమె పురీషనాళంలో సుమారు 960 గ్రాముల బంగారాన్ని దాచిపెట్టి అక్రమంగా తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు ఆ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు డీఆర్ఐ అధికారులు తెలిపారు. అనంతరం సురభి



ఖతున్‌ను మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా.. 14 రోజుల రిమాండ్ విధించినట్లు వెల్లడించారు. కాగా, సురభి ఖాతున్ బంగారాన్ని ఇలా అక్రమంగా తరలించడం ఇదేమీ తొలిసారి కాదు. గతంలోనూ చాలాసార్లు బంగారాన్ని స్మగ్లింగ్ చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

## అగ్నిగోళంగా మారిన ఉత్తరాది.. నాగ్‌పూర్‌లో 56 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు




**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, మే 31:** ఉత్తరాది రాష్ట్రాలు అగ్నిగోళంలా మండిపోతున్నాయి. ఈ సమ్మర్‌లో అక్కడ రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలతో సూర్యుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. పలు రాష్ట్రాల్లో ఇప్పటికే ఉష్ణోగ్రతలు 50 డిగ్రీలు దాటేశాయి. రెండు రోజుల క్రితం దేశ రాజధాని ఢిల్లీని ముంగేష్‌పూర్‌లో 52.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. దీనికే ప్రజలు అమ్మో అనుకుంటుండగా.. ఇవాళ మహారాష్ట్రలో ఆ రికార్డును దాటేస్తూ గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నాగ్‌పూర్‌లో అత్యధికంగా 56 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.కాగా, రికార్డు స్థాయి ఎండల కారణంగా మనుషులు పిట్టల్లా రాలిపోతున్నారు. గడిచిన 24 గంటల్లో వడ దెబ్బ కారణంగా పలు రాష్ట్రాల్లో 54 మంది ప్రాణాలు కోల్పోయారు. బిహార్‌లో అత్యధికంగా 32 మంది మరణించగా.. ఒడిశాలో 10, జార?ండ్‌లో 5, రాజస్థాన్‌లో 5, ఉత్తర్‌ప్రదేశ్‌లో ఒకరు, ఢిల్లీలో ఒకరు మరణించారు. కాగా, రానున్న రెండు రోజుల్లో యూపీ, ఢిల్లీ, చండీగఢ్, హర్యానాలోని పలు ప్రాంతాల్లో దుమ్ము తుఫాన్లు వచ్చే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అంచనావేస్తోంది.

## అశ్లీల వీడియో కేసులో ప్రజ్వల్ రేవణ్ణకు 6 రోజుల సిట్ కస్టడీ

**ఇయ్యాల్టి న్యూస్, బెంగళూరు, మే 31:** అశ్లీల వీడియో కేసులో ప్రజ్వల్ రేవణ్ణను బెంగళూరు కోర్టు 6 రోజుల సిట్ కస్టడీకి అప్పగించింది. 14 రోజుల పాటు తమ కస్టడీకి అప్పగించాలని సిట్ కోర్టును కోరింది. ఆరు రోజుల కస్టడీకి కోర్టు అనుమతించింది. రేపటి నుంచి ఆరు రోజులు ఆయనను సిట్ పోలీసులు విచారిస్తారు. రేవణ్ణను మిస్సింగ్ మొబైల్ ఫోన్ విషయమై ఆరా తీయనున్నారు. ఫోన్, డేటా రికవరీ చేయాల్సి ఉంది.ప్రజ్వల్ రేవణ్ణను కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి సిట్ అధికారులు గురువారం రాత్రి అరెస్ట్ చేశారు. నెల రోజులకు పైగా విదేశాల్లో తలదాచుకున్న రేవణ్ణ బెంగళూరు రాగానే ఐదుగురు మహిళా పోలీసులు అతనిని అరెస్ట్ చేసి హెడ్‌మూరికట్టిలోని సిట్ కార్యాలయానికి తీసుకువచ్చారు.



ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.com/
చూసి ముర్వాలే
శనివారం 01, జూన్ 2024


# సూపర్ స్టార్ కృష్ణకు మహేశ్ బాబు ఎమోషనల్ బర్త్‌డే విషెస్




ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, మే 31: శుక్రవారం టాలీవుడ్ లెజెండరీ నటుడు కృష్ణ 81వ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆయన తనయుడు, సూపర్ స్టార్ మహేశ్ బాబు 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ప్రత్యేకంగా బర్త్‌డే విషెస్ తెలియజేశారు. "హ్యాపీ బర్త్ డే నాన్నా. మిమ్మల్ని చాలా మిస్ అవుతున్నా. నా ప్రతి స్మృతిలో మీరు ఎప్పటికీ జీవిస్తూనే ఉంటారు! " అంటూ ప్రిన్స్ ఎమోషనల్ ట్వీట్ చేశారు. దీనికి కృష్ణ పాత ఫొటోను జత చేశారు. కాగా, 300కి పైగా చిత్రాల్లో హీరోగా నటించిన కృష్ణ.. తొలి జేమ్స్‌బాండ్, తొలి కౌబాయ్, తొలి సినిమా స్కోప్, తొలి 70ఎమ్ఎమ్ వంటి ఎన్నో తొలి అనుభూతుల్ని తెలుగు చిత్ర పరిశ్రమకు అందించిన ఘనత ఆయనది. హీరోగానే కాదు.. దర్శకుడిగా, నిర్మాతగా టాలీవుడ్‌లో అభిమానుల గుండెల్లో ఎవర్‌గ్రీన్ స్టార్‌గా నిలిచిపోయారు.

## మనమే మూవీ ప్రమోషన్లలో బేబమ్మ..

### క్యూట్‌గా కృతిశెట్టి

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, మే 31: టాలీవుడ్ బేబమ్మ.. ఇప్పుడు మరో సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇప్పుడు వరకు బేబిలా ఉన్న క్యారెక్టర్స్ చేసి ఇప్పుడు బేబి బాయ్?కి తల్లిగా చేస్తోంది.



## ఫీలింగ్స్‌ని అదుపు చేయలేము.. కానీ, సంయుక్త మీనన్

### ఇంట్రెస్టింగ్ పోస్ట్, ఆ కోట్ ఆంతర్యం ఏమిటో..

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, మే 31: హీరోయిన్ సంయుక్త మీనన్ గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ భీమ్లా నాయక్ సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది.ఇందులో రానా భార్య తన నటనతో ఆకట్టుకుంది. తొలి సినిమా హిట్ కావడంతో ఆమె మన తెలుగు దర్శకనిర్మాతల దృష్టిలో పడింది. ఆ వెంటనే బింబిసార, సార్, విరూపాక్ష ఇలా వరుస సినిమాలు చేసి హిట్స్ కొట్టింది.ఈ దెబ్బతో తెలుగులో గోల్డెన్ లెగ్‌గా ముద్ర వేసుకుంది. దీంతో టాలీవుడ్‌లో మంచి క్రేజ్ సంపాదించుకున్న ఈ బ్యూటీ ఆఫర్స్ వస్తున్నా కూడా ఎందుకో నో చెబుతుందట.ఇక చివరిగా విరూపాక్షలో కనిపించిన ఈ బ్యూటీ తరచూ సోషల్ మీడియోలో తన హాట్ ఫోటోలతో ఆకటత్తుకుంటుంది. తాజాగా ఈ బ్యూటీ ఓ డీప్ మీనింగ్ కోట్‌తో వచ్చింది. భావాలు అలల వంటివి. అవి రాకుండ అదుపు చేయలేము. కానీ వాటిలో దేనిని తుడిచేయాలనేది మాత్రం మన చేతుల్లోనే ఉంది. అంటూ ఫోటోలు షేర్ చేసింది.






## బికినీలో హీరోయిన్ బంపర్ షో..

### ఎక్స్‌పోజింగ్ అంటే ఇదే అనేలా!

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, మే 31: మెహ్రీన్ కౌర్ సోషల్ మీడియాలోనూ విపరీతంగా హడావిడి చేస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా ఈ అమ్మడు కొన్ని హాట్ ఫొటోలను షేర్ చేసింది.

గ్లామర్ దోస్ పెంచేసిన ప్రియాంక జైన్.. తడిసిన అందాలతో కైపెక్కిస్తోన్న బిగ్?బాస్ బ్యూటీ



# 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' – మూవీ రివ్యూ!

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, మే 31: విష్వక్సేన్ హీరోగా 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' సినిమా రూపొందింది. సూర్యదేవర నాగవంశీ – సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమాకి కృష్ణ చైతన్య దర్శకత్వం వహించాడు. విష్వక్ కి మాస్ హీరోగా మంచి ఇమేజ్ ఉంది. ఆ ఇమేజ్ కి తగిన కథతో .. గోదావరి నేపథ్యంతో వచ్చిన సినిమానే ఇది. ఈ రోజునే విడుదలైన ఈ సినిమా, ప్రేక్షకులను ఏ స్థాయిలో ఆకట్టుకుందనేది చూద్దాం.

అది గోదావరి జిల్లాలోని 'కొవ్వూరు' అనే ఒక లంక గ్రామం. అక్కడ నానాజీ (నాజర్) దొరస్వామిరాజు (గోపరాజు రమణ) రెండు పార్టీలకు చెందిన నాయకులు. ఇద్దరూ కూడా పెత్తనం కోసం పోటీపడుతుంటారు. ఎమ్మెల్యేగా ఉన్న దొరస్వామిరాజు చక్రం తిప్పుతూ ఉంటాడు. ఆ విషయంలో అతనికి బావమరిది రాధ (ప్రవీణ్) సాయపడుతూ ఉంటాడు. ఇక నానాజీకి బుజ్జి (నేహా శెట్టి) అనే కూతురు ఉంటుంది. రత్నం (విష్వక్) కన్ను ఆ అమ్మాయి మీద పడుతుంది. ఆమెను ఎలాగైనా దక్కించుకోవాలని అనుకుంటాడు.

అయితే రత్నం ప్రధానమైన ఉద్దేశం ఆ అమ్మాయిని పొందడమే కాదు, అక్కడ రాజకీయ పరంగా ఎదగడం .. అందుకోసం దేనికైనా వెనుకాడకపోవడం. ఆ ఊళ్లో అతని కష్టం .. నష్టం వినే మనిషి ఎవరైనా ఉన్నారంటే అది రత్నమాల ( అంజలి) మాత్రమే. ఆమెపై వేశ్య అనే ముద్ర ఉన్నప్పటికీ, ఆమె రత్నం మనిషిగానే చెలామణి అవుతూ ఉంటుంది. అయితే నానాజీ కూతురు దగ్గరికి వెళ్లొద్దని ఆమె రత్నాన్ని హెచ్చరిస్తుంది కూడా.

తన గ్రామ సరిహద్దుల్లో తనకి తెలియకుండా భారిస్థాయిలో ఇసుక మాఫియా జరుగుతుందనే విషయం రత్నానికి అర్థమవుతుంది. ఆ ఇసుక మాఫియా వలన రాజకీయ నాయకులు కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారని తెలుస్తుంది. ఇసుక మాఫియాపై పట్టు సాధించాలంటే రాజకీయనాయకుడి అవతారం ఎత్తాలనే విషయం అతనికి అర్థమైపోతుంది. దాంతో అతను ఆ క్షణం నుంచే అందుకు సంబంధించిన సన్నాహాలు మొదలెట్టేస్తాడు.

నానాజీకీ .. దొరసామికి పడకపోవడాన్ని రత్నం తెలివిగా తనకి అనుకూలంగా మార్చుకుంటాడు. ఆ ఇద్దరి మధ్య మరింత శత్రుత్వాన్ని సృష్టించి, ఒకరికి తెలియకుండా ఒకరికి దగ్గరవుతాడు. ముందుగా నానాజీ విశ్వాసాన్ని సంపాదించుకుని, దొరసామిని దెబ్బకొడతాడు. ఆ తరువాత ఎమ్మెల్యేగా బలం పుంజుకుని నానాజీకి ఎదురు తిరుగుతాడు. అదే సమయంలో బుజ్జిని తన వైపుకు తిప్పుకుని, తనతో పాటు ఇంటికి వచ్చేలా చేస్తాడు.


తనని నమ్మించి తన పదవిని లాగేసుకున్న రత్నంపై దొరసామి ఆగ్రహావేశాలతో రగిలిపోతూ ఉంటాడు. ఇక తనని నమ్మించి తన కూతురును తీసుకుని వెళ్లిపోయాడని కోపంతో నానాజీ ఉంటాడు. ఇద్దరూ కూడా ఎవరికి వారు రత్నంపై ప్రతీకారం తీర్చు కోవడానికి రంగంలోకి దిగుతారు. ఇక అప్పటివరకూ రత్నం వెంట నిలిచిన అతని అనుచరులు, అతనిపైనే కత్తిగడతారు. అప్పుడు ఏం జరుగుతుంది? ఆ తరువాత ఏమౌతుంది? అనేది మిగతా కథ.

ఈ సినిమాకి రచయిత .. దర్శకుడు కృష్ణచైతన్య. ముందుగా ఆయన విష్వక్ సేన్ కి ఉన్న ఇమేజ్ కి తగిన కథను .. ఆయన బాడీ లాంగ్వేజ్ కి తగిన పాత్రను డిజైన్ చేసుకోవడంలో సక్సెస్ అయ్యాడనే చెప్పాలి. ఏ సినిమాలోనైనా ఇంటర్వెల్ బ్యాంగ్ .. ప్రీ క్లైమాక్స్ .. క్లైమాక్స్ ప్రధానమైన పాత్రను పోషిస్తాయి. ఈ సినిమాకి సంబంధించి ఈ మూడు అంశాలలో ప్రేక్షకులు అసంతృప్తి చెందరు.

సాధారణంగా ఫ్యామిలీ అనేది లేనివాళ్లు రౌడీయిజం చెలాయించడానికి ఎంతమాత్రం వెనుకాడరు. అదే ఒక రౌడీకి ఫ్యామిలీ ఏర్పడిన తరువాత ఆ ఫ్యామిలీని డిస్టబ్ చేయడానికి ఎవరైనా ట్రై చేస్తే ఎంతలా తెగిస్తారనేదే ఈ సినిమా కథ. ఇంటర్వెల్ బాంగ్ తోనే క్లైమాక్స్ ను తలపించిన డైరెక్టర్, ఆ తరువాత కథను పట్టుగా నడిపించడంలోను మెప్పించాడు.

యాక్షన్ ను .. ఎమోషన్ ను దర్శకుడు బ్యాలెన్స్ చేస్తూ వెళ్లాడు. వెంకట్ – పృథ్వీ డిజైన్ చేసిన యాక్షన్ సీన్స్ ఆకట్టుకుంటాయి. ముఖ్యంగా ఫస్టాఫ్ లోని లారీ ఫైట్ సీన్ .. సెకండాఫ్ లో పడవపై రాజీ కోసం 'యదూ'ను కలిసే సీన్ ఈ సినిమాకి హైలైట్ గా నిలుస్తాయి. రొమాన్స్ కి పెద్దగా టైమ్ ఇవ్వకుండా లైట్ గా టచ్ చేస్తూ వెళ్లారు. కామెడీ కోసం ప్రత్యేకంగా ప్రయత్నించకుండా, ఆది పంచ్ లతో సరిపెట్టారు.

విష్వక్ .. నేహా శెట్టి .. అంజలి .. నాజర్ .. గోపరాజు రమణ ఇలా ఎవరికి వారు తమ పాత్రలకి న్యాయం చేశారు. నిర్మాణ విలువల విషయానికి వస్తే, ఎక్కడా వంక బెట్టలేం. యువన్ శంకర్ రాజా నేపథ్య సంగీతం ఈ సినిమాకి ప్రధానమైన బలంగా నిలిచిందని చెప్పచ్చు.సెకండాఫ్ మొదలైన తరువాత వచ్చే ఒక సాంగ్ దగ్గరమాత్రం గ్రాఫ్ పడిపోయినట్టు అనిపిస్తుంది. అనిత్ మదాడి కెమెరా పనితనం .. నవీన్ నూలి ఎడిటింగ్ వర్క్ బాగుంది.




Published by: Rathnasri Latha on Behale of RRR Media Patel Nagar chowrasta.. Amberpet.. Hyderabad.. Telangana. 500013 cell: 888643 1510, 9949 152838